

ఉత్సవ విగ్రహాలుగా
ఆలయ కమిటీలు
7
● వసూలుకాని అద్దె
● కరువైన పూజలు



వేణుగోపాలస్వామి ఆలయ భూమి



నెట్‌బాల్ ట్రెడిషనల్ విజేత మహబూబ్‌నగర్ బాలుర జట్టుకు ట్రోఫీ అందిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

చాంపియన్స్
మహబూబ్‌నగర్, రంగారెడ్డి, మేడ్చల్

● ట్రెడిషనల్ బాలుర విభాగంలో మహబూబ్‌నగర్.. బాలికల విభాగంలో రంగారెడ్డి..
● ఫాస్ట్-5 బాలుర విభాగంలోనూ మహబూబ్‌నగర్.. బాలికల విభాగంలో మేడ్చల్
● మిక్స్‌డ్ విభాగంలో రంగారెడ్డి విజయం
● ముగిసిన రాష్ట్రస్థాయి జూనియర్ నెట్‌బాల్ పోటీలు
● బహుమతులను ప్రదానం చేసిన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్ అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి నెట్‌బాల్ చాంపియన్ షిప్ పోటీల్లో మహబూబ్‌నగర్, రంగారెడ్డి, మేడ్చల్ జట్లు విజేతలుగా నిలిచాయి. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని స్టేడియం మైదానంలో మూడు రోజులుగా జరుగుతున్న పోటీలు ఆదివారం ముగిశాయి. చివరి రోజు ట్రెడిషనల్ బాలుర విభాగంలో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో మహబూబ్‌నగర్ జట్టు 13-7 పాయింట్లతో నారాయణపేట జట్టుపై, బాలికల విభాగంలో రంగారెడ్డి జట్టు 18-10 పాయింట్లతో నల్గొండపై గెలుపొందాయి. బాలుర విభాగంలో నారాయణపేట, బాలికల విభాగంలో నల్గొండ జట్లు రన్నర్‌గా, మహబూబ్‌నగర్ బాలికల జట్టు మూడో స్థానంలో నిలిచాయి. ఫాస్ట్-5 బాలుర విభాగంలో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో మహబూబ్‌నగర్ జట్టు 16-15 పాయింట్ల తేడాతో నారాయణపేట, బాలికల విభాగంలో మేడ్చల్ జట్టు 21-13 పాయింట్ల తేడాతో నల్గొండపై గెలిచి చాంపియన్‌గా నిలిచాయి. బాలుర విభాగంలో నారాయణపేట, బాలికల విభాగంలో నల్గొండ రన్నర్‌గా నిలిచాయి. మిక్స్‌డ్ విభాగంలో రంగారెడ్డి జట్టు 13-8 పాయింట్ల తేడాతో ఖమ్మంపై గెలుపొందగా, ఖమ్మం జట్టు రన్నర్‌గా నిలిచింది.

క్రీడాభివృద్ధికి ప్రభుత్వం కృషి

క్రీడాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాల కృషి చేస్తుందని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా నెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి జూనియర్ నెట్‌బాల్ చాంపియన్‌షిప్ టోర్నీ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విజేతలకు బహుమతులను ప్రదానం

(మిగతా 6లో..)

మక్తల్‌లో కార్పొరేట్ తరహా వైద్య సేవలు

● పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి




ఆస్పత్రి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మంత్రి శ్రీహరి

మక్తల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గ కేంద్రంలోని బీసీ కాలనీలో నిర్మిస్తున్న 150 పడకల ఆస్పతి ద్వారా కార్పొరేట్ తరహా వైద్య సేవలు అందుబాటులోకి తెస్తామని పశుసంవర్ధక, క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. ఆదివారం ఆయన ఆస్పత్రి నిర్మాణ పనులను పరిశీలించి, మాట్లాడారు. మక్తల్ నియోజకవర్గంలో పేద ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు రూ.42 కోట్లతో 150 ఆస్పత్రి నిర్మిస్తున్నట్లు చెప్పారు. పనులు త్వరగా పూర్తి చేయాలని గుత్తేదారును ఆదేశించారు. అలాగే, పట్టణంలోని పడమటి ఆంజనేయస్వామి కోనేరు పనులను మంత్రి పరిశీలించారు. బ్రహ్మోత్సవాల నాటికి కోనేరు సుందరీకరణ పూర్తిచేసి, భక్తులకు అందుబాటులోకి తెస్తామన్నారు. కార్యక్రమంలో బీకేఆర్ ఫౌండేషన్ అధినేత బాలకృష్ణారెడ్డి, కాంగ్రెస్ నాయకులు గణేష్‌కుమార్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు లక్ష్మారెడ్డి, వాకిటి హన్మంతు, శివరాజ్, బోయ రవికుమార్ తదితరులు ఉన్నారు.

విధానమే..
నినాదమా?

● డీసీసీ అధ్యక్షులుగా బీసీ, ఎస్సీ, మైనారిటీలకు అవకాశం ఇవ్వాలంటున్న అనిరుధ్ రెడ్డి
● మరోసారి పాలమూరు అధ్యక్ష పదవి కోరుతున్న మధుసూధన్ రెడ్డి
● తెరపైకి జీవన్‌రెడ్డి పేరు.. బీసీ, ఎస్సీ, మైనారిటీల నుంచీ తీవ్ర పోటీ
● రెడ్డి వర్సెస్ నాన్‌రెడ్డిగా పదవి పోటీ మారే అవకాశాలు
● ఇతర జిల్లాల్లోనూ పోటీపడుతున్న నాయకులు



మహబూబ్‌నగర్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కాంగ్రెస్ రాష్ట్ర వ్యాప్తంగా బీసీ నినాదాన్ని తమ విధానంగా మార్చుకున్న విషయం తెలిసిందే.. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం కోర్టుల్లో వాదిస్తోంది. ప్రస్తుతం ఆ అంశం కోర్టు పరిధిలో ఉండగా.. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న డీసీసీ అధ్యక్షుల నియామకం విషయంలో ప్రస్తుతం కసరత్తు ప్రారంభించింది. ఆయా జిల్లాలకు కేటాయించిన ఏఐసీసీ పరిశీలకులు.. ఎమ్మెల్యేలు, ఆశావహులతో సమావేశమై అభిప్రాయాలను తీసుకోవడంతోపాటు.. జిల్లాకు ఆరు దరఖాస్తులను పంపించనున్నారు. ఆ తర్వాత అధ్యక్షుల ప్రకటన పార్టీ అధిష్ఠానం చేయనుంది. అయితే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో కూడా ఏళ్లుగా ఎదురుచూస్తున్న నాయకులు చాలామంది ఈ పదవుల కోసం పోటీపడుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు ముంగిట ఉండటంతో ఈ సారి తమకు అవకాశం దక్కితే.. కచ్చితంగా ప్రభావం చూపించుకోవచ్చనే భావనలో ఉన్నారు. దాంతో ఇప్పటికే ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేల వెంట పడుతున్నారు. తాజాగా పరిశీలనలోకి వస్తున్న పేర్లలో కొన్ని పాతవే కాగా.. ఊహించనట్లుగా

(మిగతా 6లో..)

జిల్లాల వారీగా ఆశావహులు..

మహబూబ్‌నగర్ డీసీసీతోపాటు ఇతర జిల్లాల డీసీసీలకు పోటీ తీవ్రంగానే ఉంది. నారాయణపేట డీసీసీ అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్యే వీరారెడ్డి తనయుడు ప్రశాంత్‌రెడ్డి ఉన్నారు. వాకిటి శ్రీహరి ఎమ్మెల్యే అయిన తర్వాత ఆయనకు ఈ పదవి దక్కింది. కాబట్టి మరోసారి ఆయన అధ్యక్ష పదవిని కోరుకుంటున్నారు. ఆయనతోపాటు బీఆర్‌కే ఫౌండేషన్ ఛైర్మన్ బాలకిష్టారెడ్డి, గోటూరు నాగేశ్వర్‌రెడ్డి, సీఎం నియోజకవర్గానికి చెందిన ప్రసన్నరెడ్డి, రఘువర్ధన్‌రెడ్డి, రఘుపతిరరెడ్డిలు ఆశిస్తున్నారు. వాస్తవానికి జడ్పీ ఎన్నికలు జరిగిన తర్వాత అయితే కొందరిని అక్కడ అడ్జస్ట్ చేసే అవకాశం దక్కేది. జోగులాంబ గద్వాల జిల్లాలో డీసీసీ అధ్యక్ష పదవి కోసం జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ భర్త తిరుపతయ్య, బండ్ల అనుచుడు గడ్డం కృష్ణారెడ్డి, డీసీసీ మాజీ అధ్యక్షుడు పటేల్ ప్రభాకర్‌రెడ్డి, నల్లారెడ్డి తదితరులు పోటీపడుతున్నట్లు సమాచారం. అయితే సంపత్‌కుమార్ మద్దతు ఇక్కడ కీలకం కానుంది. నాగర్‌కర్నూల్ జిల్లాలో అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ ప్రస్తుతం డీసీసీ అధ్యక్షుడిగా ఉండగా.. ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి, ఆయన తనయుడు ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి, హబీబ్, విజయ్‌కుమార్, రాము యాదవ్ తదితరులు పోటీ పడుతున్నారు. వనపర్తి జిల్లాలో ప్రస్తుత అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ మరోసారి అవకాశం అడుగుతున్నారు. ఎమ్మెల్యే అనుచరుడు లక్కాకుల సతీష్, చిన్నారెడ్డి అనుచరుడు డి.కిరణ్‌కుమార్ ఇన్నాళ్లు పోటీపడగా.. ప్రస్తుతం స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనారెడ్డి కూడా డీసీసీ అధ్యక్ష పదవి ఆశిస్తున్నట్లు చర్చ జరుగుతోంది.



పాలమూరు యూనివర్సిటీ

పీయూకు..
స్నాతకోత్సవ శోభ

● ఈనెల 16న కార్యక్రమం..
● ముఖ్య అతిథిగా గవర్నర్
● పన్నెండు మందికి పీహెచ్‌డీ పట్టాలు, 83 మందికి బంగారు పతకాలు ప్రదానం
● ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారయంత్రాంగం



పాలమూరు యూనివర్సిటీ, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): పాలమూరు యూనివర్సిటీ స్నాతకోత్సవ శోభ సంతరించుకుంది. ఈనెల 16న నాల్గో స్నాతకోత్సవం నిర్వహించేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ కార్యక్రమానికి మొదటిసారిగా గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ వస్తుండటంతో అధికారులు ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. గవర్నర్‌తో పాటు ఎంఎస్‌ఎన్ గ్రూప్ కంపెనీ వ్యవస్థాపకులు, ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మన్నె సత్యనారాయణ రెడ్డి ముఖ్య అతిథిగా వస్తున్నారు. మొదటి, రెండు, స్నాతకోత్సవాలకు అప్పటి గవర్నర్ రాలేకపోవడంతో ముఖ్య అతిథులతోనే కార్యక్రమాన్ని నిర్వహించారు. మూడో స్నాతకోత్సవానికి మొదటి సారిగా అప్పటి గవర్నర్ డాక్టర్ సౌందర రాజన్ వచ్చిన విషయం తెలిసిందే. కార్యక్రమంలో 12 మందికి పీహెచ్‌డీ డిగ్రీలు, 83 మందికి బంగారు పతకాలతో పాటు దాదాపు 3,000 మందికిపైగా పీజీ డిగ్రీలు, 30,000 మందికి పైగా యూజీ

(మిగతా 6లో..)

అందరి సహకారంతో విజయవంతం చేస్తాం



యూనివర్సిటీ స్నాతకోత్సవానికి రెండోసారి గవర్నర్ అధ్యక్షత వహించనున్నారు. ఈ కార్యక్రమం విజయవంతానికి అన్ని చర్యలు తీసుకున్నాం. వర్సిటీని అంతర్జాతీయ ప్రమాణాల స్థాయికి తీసుకెళ్లేలా చర్యలు తీసుకుంటున్నాం. ఈ ఏడాది కొత్తగా ఇంజనీరింగ్, లా, కోర్సులను ప్రవేశ పెట్టాం. కేంద్ర, రాష్ట్ర, స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో సదుపాయాలు, సౌకర్యాలు కల్పిస్తున్నాం.

- ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్, పీయూ వైస్ ఛాన్సలర్



అరుదైన తెల్ల కలువ పుష్పం



హబినేరియా ఫర్సిఫెర పుష్పం

అబ్బురం.. అద్భుతం

● జడ్చర్లలోని బొటానికల్ గార్డెన్‌లో వికసించిన అరుదైన పుష్పాలు 6

యువతి ఫొటోలతో
నకిలీ ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్
7
● మిడ్జిల్‌కు చెందిన అవేజ్‌పై కేసు నమోదు

చీరాల ఓడరేవు బీచ్‌లో..
జడ్చర్ల విద్యార్థి మృతి
● విజయవాడలోని వీఐటీ కళాశాలలో బీటెక్ చదువుతున్న మణిదీప్ 7

పనితీరు ఆధారంగానే డీసీసీ పోస్టు

● ఆసక్తిగల వారినుంచి ఈనెల 20 వరకు దరఖాస్తుల స్వీకరణ
● ఏఐసీసీ పరిశీలకుడు నారాయణస్వామి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐసీసీ పరిశీలకుడు నారాయణస్వామి

మహబూబ్‌నగర్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): అందరినీ కలుపుకుని పోయే సామర్థ్యం, పని తీరు, వివాదరహితులను జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులుగా పార్టీ నియమించనుందని ఏఐసీసీ పరిశీలకుడు నారాయణస్వామి తేల్చి చెప్పారు. ఆదివారం డీసీసీ అధ్యక్ష పదవి కోసం అభిప్రాయాలు తెలుసుకునేందుకు మహబూబ్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. డీసీసీ అధ్యక్ష పదవికోసం ఆసక్తిగల అభ్యర్థుల నుంచి ఈనెల 20లోగా దరఖాస్తులను స్వీకరించనున్నామని, వారిలో ఆరుగురి పేర్లు ఫైనల్ చేసి ఈనెల 22న ఏఐసీసీకి నివేదిస్తామని చెప్పారు. మూడు రోజులు ఇక్కడే ఉంటానని, అందరి అభిప్రాయాలు తీసుకుంటానని చెప్పారు. స్థానిక ఎన్నికల్లో పార్టీని గెలిపించే సామర్థ్యం గల నాయకులను డీసీసీ అధ్యక్షులుగా నియమించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో ఎమ్మెల్యేలు జి.మధుసూదన్‌రెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, టీపీసీసీ పరిశీలకులు గణేష్, బెట్టు సాయి, ఉజ్మషకీల్, నాయకులు ఒబేదుల్లా కొత్వాల్, జీవన్‌రెడ్డి, సంజీవ్ ముదిరాజ్, హర్షవర్ధన్‌రెడ్డి, లక్ష్మణ్ యాదవ్, బెక్కరి అనిత, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

కొడుకు ఆరోగ్యం బాగు చేస్తామని
నిలువు దోపిడీ

● ఆస్తులను కాజేసిన దంపతులు
● రూ.2.60 కోట్ల నగదు
● 60 తులాల బంగారు నగలు, రెండు కిలోల వెండి 6
● మూడు ప్లాట్లు, ఇల్లు, ఏడెకరాల భూమి కూడా..

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా చికెన్ సెంటర్స్ అసోసియేషన్
నేటి చికెన్ ధరలు

ఫామ్ లైవ్	: 110.00
హోల్ సేల్	: 116.00
డ్రెస్డ్	: 191.00
స్కిన్ లెస్	: 218.00

వీధి కుక్కల దాడి 6
ఐదుగురు చిన్నారులకు గాయాలు

ఈకేవైసీతో అక్రమాలకు చెక్

● ఉపాధి హామీ పథకంలో కేంద్రం సంస్కరణలు
● జాబ్‌కార్డు ఉన్న ప్రతీ ఒక్కరు చేయించుకోవాల్సిందే
● నారాయణపేట జిల్లాలో ఇప్పటి వరకు 37.36 శాతం పూర్తి

నారాయణపేట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అవినీతి అక్రమాలకు చెక్‌పెట్టి, నిజమైన కూలీలకు లబ్ధి చేకూరేలా కేంద్ర ప్రభుత్వం సంస్కరణలు చేపడుతోంది. ఈ నేపథ్యంలో మరింత పారదర్శకత పెంచేలా జాబ్‌కార్డు కలిగిన ప్రతీ ఒక్క కూలీకి ఈకేవైసీ విధానం అమలు చేసేందుకు నిర్ణయించింది. తప్పుడు హాజరుకు చెక్ పెట్టడంలో భాగంగా ఈకేవైసీ యాప్‌లో కూలీ ఫొటో ఆధారంగా పని చేసే ప్రాంతంలో అదే కూలీ ఫొటోను రెండు సార్లు తీయాల్సి ఉంటుంది. అలా కాకుండా ఇతరుల ఫొటో తీసే ప్రయత్నం చేస్తే యాప్‌లో హాజరు నమోదు కాదు. దాంతో ఒకరి పేరుపై ఇద్దరు కూలీల పేర్లు నమోదు చేసే అక్రమాలకు చెక్ పడనుంది. నారాయణపేట జిల్లా వ్యాప్తంగా 1,20,508 ఉపాధి కూలీలు ఉన్నారు. వారందరికీ ఈకేవైసీ చేసేందుకు ఉపాధి హామీ సిబ్బంది 146 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు, 50 మంది మేటీలు క్షేత్ర స్థాయిలో కూలీల ఫొటోలు తీసి యాప్‌లో అనుసంధానం చేస్తున్నారు. ఈ నెల 10 వరకు 54,019 మంది కూలీల ఈకేవైసీ పూర్తి చేశారు. అంటే 37.36 శాతం పూర్తి అయ్యింది.



అభంగాపూర్‌లో ఈకేవైసీ కోసం కూలీల ఫొటో తీస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ చెన్నప్ప(ఫైల్)

రోజుకు వంద మంది లక్ష్యం

రోజుకు వంద మంది కూలీల ఈకేవైసీ పూర్తి చేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులు టార్గెట్ విధించడంతో ప్రక్రియ వేగంగా కొనసాగుతోంది. గ్రామాల్లో సర్వర్ వంటి సాంకేతిక ఇబ్బందులు ఉన్న చోట ప్రక్రియలో జాప్యం జరుగుతోంది. జిల్లాలో ఇప్పటి వరకు ఈకేవైసీ అత్యధికంగా కోస్గి మండలంలో 9,077 మందికి గాను 2,940 మంది కూలీలకు పూర్తి చేశారు. అత్యల్పంగా కృష్ణ మండలంలో 4,320 మందికి గాను 1,253 మంది కూలీలకు ఈకేవైసీ పూర్తయ్యింది.

ప్రతి ఒక్కరూ విధిగా చేయించుకోవాలి: డీఆర్‌డీఏ పీడీ మొగులప్ప

ఈకేవైసీ అయిన కూలీలకు మాత్రమే ఉపాధి హామీ పనులు కల్పిస్తారని డీఆర్‌డీఏ పీడీ మొగులప్ప చెప్పారు. ప్రతి ఒక్కరూ విధిగా ఫీల్డ్ అసిస్టెంట్లు, మేటీల దగ్గర నమోదు చేసుకోవాలని అన్నారు. ఈకేవైసీ ప్రక్రియ త్వరలోనే పూర్తవుతుందని తెలిపారు.

చాంపియన్ మహబూబ్‌నగర్, రంగారెడ్డి, మేడ్చల్



నెట్‌బాల్ విజేత రంగారెడ్డి బాలికల జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

(5వ పేజీ తరువాయి)

చేసి, మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో క్రీడలకు పెద్దపీట వేశారన్నారు. అందుకే గత ఏడాది రూ.370 కోట్లు, ఈ ఏడాది రూ.460 కోట్ల బడ్జెట్ కేటాయించారని అన్నారు. త్వరలో స్పోర్ట్స్ యూనివర్సిటీ నెలకొల్పి, వర్ధమాన క్రీడాకారులను ప్రోత్సహిస్తామన్నారు. జిల్లా క్రీడాభివృద్ధికి రూ.16 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రత్యేక శిక్షణ ఇప్పించి, జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎన్‌పీ వెంకటేశ్, రాష్ట్ర నెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు విక్రమాదిత్యరెడ్డి, శిరీషరాణి, రాంమోహన్, అంజద్, షరీఫ్ పాల్గొన్నారు.

మైసమ్మ దేవతకు పూజలు


నాయినోనిపల్లి మైసమ్మ దేవతకు భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తున్న భక్తులు

పెద్దకొత్తపల్లి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం నాయినోనిపల్లి గ్రామ శివారులో భక్తులకు కొంగుబంగారంగా వెలిసిన మైసమ్మ దేవతకు భక్తులు పూజలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచే కాకుండా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ఈ ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు మైసమ్మ దేవతను దర్శించుకున్నారు. భక్తుల నుంచి 1,73,998 రూపాయల ఆదాయం వచ్చినట్లు ఆలయ చైర్మన్ శ్రీనివాస్‌యాదవ్, ఈవో రామేశ్వర్‌శర్మ తెలిపారు.

ఊర్కొండలో గంధోత్సవం


గంధోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఊర్కొండ, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని కల్వకుర్తి-జడ్చర్ల ప్రధాన రహదారి వద్ద ఉన్న గుట్టపై వెలిసిన హజ్రత్ ఖాజా సయ్యద్ యూసుఫొద్దీన్ చిష్తి మిర్జాయి ఖలందరి దర్గాలో ఆదివారం రాత్రి ఉర్సే షరీఫ్‌లో భాగంగా గంధోత్సవ వేడుకలు అంగరంగా వైభవంగా, కనుల పండువగా నిర్వహించారు. మండల కేంద్రంలోని మ్యాకల అంజయ్య స్వగృహం నుంచి బాజాభజంత్రీల నడుమ గంధోత్సవాన్ని ఊరేగింపుగా దర్గాకు తీసుకొచ్చారు. అనంతరం భక్తిశ్రద్ధలతో దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మ్యాకల శ్రీనివాసులు, మ్యాకల అంజయ్య, దర్గా నిర్వాహకులు హఫీజ్ వఖారి ఖాజా సయ్యద్ షర్ఫొద్దీన్ చిష్తి మిర్జాయి ఖలందరి, షబ్బీర్, సిరాజ్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో విద్యార్థి ప్రతిభ



విద్యార్థి పాండును అభినందిస్తున్న కోచ్ భాస్కర్ యాదవ్

కొల్లాపూర్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 10 నుంచి 12వ తేదీ వరకు నిజామాబాద్ జిల్లాలో నిర్వహించిన 69వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ తైక్వాండో పోటీలలో కొల్లాపూర్ తాలూకాకు చెందిన పాండు పాల్గొని తృతీయ స్థానంలో నిలిచాడు. కొల్లాపూర్ తైక్వాండో కింగ్స్ క్లబ్ అకాడమీకి చెందిన పాండు రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ తైక్వాండో పోటీలలో అండర్ 14, 23 కేజీల విభాగంలో ప్రతిభ కనబరిచి తృతీయ స్థానంలో నిలిచి బ్రౌంజ్ మెడల్ సాధించాడని కోచ్ భాస్కర్ యాదవ్ తెలిపారు. పతకం సాధించిన విద్యార్థిని తైక్వాండో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ మాస్టర్ శ్రీహరి, నాగర్‌కర్నూల్ జిల్లా సెక్రటరీ శేఖర్, మాస్టర్ శరబందరాజ్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

కొడుకు ఆరోగ్యం బాగు చేస్తామని నిలువు దోపిడీ

» ఆస్తులను కాజేసిన దంపతులు


మహబూబ్‌నగర్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : నాలుగేళ్ల క్రితం కోవిడ్ సమయంలో జిల్లా కేంద్రం రాజేంద్రనగర్‌కు చెందిన పురేందర్‌రెడ్డి ఏకైక కుమారుడు అనారోగ్యానికి గురయ్యాడు. డాక్టర్లు పరీక్షించి బతికే అవకాశాలు తక్కువగా ఉన్నాయని చెప్పారు. అనారోగ్యానికి గురైన వ్యక్తి అత్తమామల ఇంటి దగ్గర ఉన్న పాలడుగు రఘురాం, అతని భార్య సునీతను పురేందర్‌రెడ్డికి పరిచయం చేసి వీళ్లు గుంటూరు బాపట్ల నుంచి వచ్చారని చెప్పారు. నీ కుమారుడికి చేతబడి చేశారని, ఇందుకోసం విజయవాడకు చెందిన బ్రాహ్మణ సిద్ధాంతిని సంప్రదించాలని వారిని ఆ కిలాడీ దంపతులు నమ్మించారు. తన కుమారుడి ప్రాణాలు కాపాడేందుకు పూజలు చేయించాలని రఘురాంను కోరగా తాను బ్రాహ్మణ సిద్ధాంతిని సంప్రదించాలని, పూజ చేయడానికి అతనికి మీ వద్ద ఉన్న బంగారు, వెండి నగలు అవసరమని, పూజ అనంతరం తిరిగి ఇస్తారని చెప్పారు. వారిని నమ్మి 60 తులాల బంగారు నగలు, రెండు కిలోల వెండి ఇచ్చారు. అప్పటికే అనారోగ్యంతో ఉన్న కొడుకును వదిలి వెళ్లిన కోడలు మీపై క్రిమినల్, సివిల్ కేసులు పెట్టేందుకు సిద్ధమవుతుందని దంపతులు చెప్పడంతో షాక్ అయ్యారు. మీ ఆస్తులు మీకు నమ్మకంగా ఉన్న తమ పేర్లపై బదలాయించాలని కోరగా, హైదరాబాద్‌లో ఉన్న పలు ప్లాట్లు, నగరంలోని రాజేంద్రనగర్‌లో ఉన్న ఇల్లు, కందూరు దగ్గర ఉన్న ఏడెకరాల భూమిని రఘురాం దంపతులపై రాయించుకున్నారు.

మీ పేరిట డబ్బులు కూడా ఉంచుకోవద్దని మళ్లీ నమ్మించడంతో నెఫ్ట్ బ్యాంకింగ్ ద్వారా రూ.60 లక్షల నగదుతో పాటు ఇంట్లో ఉన్న దాదాపు రూ.2 కోట్ల నగదు వారిపేరిట బదలాయించుకున్నారు.

ఆస్తులన్నీ పోయాక మొహం చాటేసిన దంపతుల మోసాన్ని గుర్తించిన బాధితులు పోలీసులను ఆశ్రయించారు. ఈ కేసులో టూటౌన్ పోలీసులు దంపతులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా నిందితులకు రిమాండ్ విధించారు.

అబ్బురం.. అద్భుతం

● జడ్చర్లలోని బొటానికల్ గార్డెన్‌లో వికసించిన అరుదైన పుష్పాలు


హబినేరియా డిజిటేట పుష్పం

జడ్చర్ల, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని బొటానికల్ గార్డెన్‌లో ఆదివారం అరుదైన పుష్పాలు వికసించాయి. అందుకు సంబంధించిన వివరాలను గార్డెన్ సమన్వయకర్త డాక్టర్ సదాశివయ్య వివరించారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లోని అడవుల నుంచి సేకరించి, నాటిన మొక్కలకు కాలానుగుణంగా పూలు పూశాయని తెలిపారు. అందులో ప్రధానంగా ఆర్కిడ్‌లు తెల్లకలువతో పాటు హబినేరియా ఫర్సిఫెర, హబినేరియా డిజిటేట, జియోడోరం డెన్సిఫ్లోరం, జియోడోరమ్ లాక్సిఫ్లోరమ్, యూలోఫియా గ్రమీనియా, లూసియా జైలానిక, వాండ టెస్సేసియాలు వికసించాయని వివరించారు. హెటిరోస్టెమ్మ బెడ్డోమి అనే తీగ జాతి మొక్కను సుమారు 160 సంవత్సరాల అనంతరం అటవీ ప్రాంతంలో న్యూఢిల్లీ శ్రీవెంకటేశ్వర కళాశాల అధ్యాపకుడు డాక్టర్ ప్రసాద్‌తో కలిసి గుర్తించినట్లు డాక్టర్ సదాశివయ్య వివరించారు. ఇదే మొక్క 1862లో కేరళ ప్రాంతంలో గుర్తించబడిందని తెలిపారు. దీనికి సంబంధించిన హెర్బేరియంను కళాశాలలోని తెలంగాణ స్టేట్ హెర్బేరియంలో భద్రపరిచినట్లు తెలిపారు. వీటన్నింటిని బొటానికల్ గార్డెన్‌లోని ప్రత్యేకమైన గ్రీన్ నెట్ హౌజ్‌లో సంరక్షిస్తున్నామని తెలిపారు.


హెటిరోస్టెమ్మ బెడ్డోమి పుష్పం

పీయూకు స్నాతకోత్సవ శోభ

(5వ పేజీ తరువాయి)

డిగ్రీలను అందించనున్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు వర్సిటీ వైస్‌ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్ నేతృత్వంలో ఏడు కమిటీలు పని చేస్తున్నాయి.

గ్రామీణ విద్యార్థులకు ఉన్నత విద్యే లక్ష్యం

గ్రామీణ విద్యార్థులకు ఉన్నత విద్యను అందుబాటులోకి తేవాలనే సంకల్పంతో 2008లో మహబూబ్‌నగర్‌లో పాలమూరు యూనివర్సిటీని స్థాపించారు. ముందు ఐదు కోర్సులతో ప్రారంభమైన వర్సిటీలో ప్రస్తుతం లా, ఇంజనీరింగ్, ఫార్మసీ, ఎంఈడీ కళాశాలతో పాటు 21 విభాగాలు అందుబాటులో ఉన్నాయి. పన్నెండు విభాగాల్లో పరిశోధనలు కొనసాగుతున్నాయి. న్యాక్ బీ గ్రేడ్, యూజీసీ 12బీ, ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, ఎంసీటీఈ గుర్తింపును సాధించింది. ఇక్కడ చదివే విద్యార్థులకు అంతర్జాతీయ సంస్థల్లో ప్లేస్‌మెంట్లు, ఉన్నతవిద్య అవకాశాలు వస్తుండటం వర్సిటీ ప్రతిష్ఠను పెంచింది. నిధులు, నియామకాల విషయంలో వర్సిటీకి సరైన ప్రాధాన్యం దక్కకపోయినా, ఉన్న వనరులతో మెరుగైన విద్యను అందించేలా అధికారయంత్రాంగం పని చేస్తోంది.

2,500 మంది విద్యార్థులు

క్యాంపస్‌లో 2,500 మంది విద్యార్థులు నేరుగా విద్యాభ్యాసం చేస్తున్నారు. వర్సిటీకి అనుబంధంగా కొల్లాపూర్, గద్వాల, వనపర్తిలలో పీజీ సెంటర్లు కొనసాగుతున్నాయి.

అదేవిధంగా ఉమ్మడి జిల్లాలోని 158 డిగ్రీ, బీఈడీ, పీజీ, ఫార్మసీ, ఎంబీఏ, ఎంసీఏ, ఎంఈడీ, ఎంపీఈడీ, లా, ఇంజనీరింగ్ కాలేజీలు అనుబంధంగా సాగుతున్నాయి. జర్నలిజం, యూనివర్సిటీ అనుబంధ ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో మాస్టర్ డిగ్రీ కోర్సులతో పాటు ఉపాధి స్కిల్ సెంటర్ ఏర్పాటుకు ఉన్నత విద్యా మండలికి ప్రతిపాదనట్లు వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్ తెలిపారు.


పాలమూరు యూనివర్సిటీ ప్రధాన ఆర్చి

అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నాం



స్నాతకోత్సవానికి ఏడు కమిటీలతో ఏర్పాట్లు చేస్తున్నాం. ఉమ్మడి జిల్లాలోని ప్రజాప్రతినిధులకు, ఉన్నతాధికారులకు అందరికి ఆహ్వానాలు అందించాం. గోల్డ్ మెడల్స్ తీసుకునే విద్యార్థుల తల్లిదండ్రులు రానున్నారు. అందరికీ అవసరమైన ఏర్పాట్లు చేయడంలో అధికారులు, అధ్యాపకులు, సిబ్బంది, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, విద్యార్థులు పని చేస్తున్నారు.

- ప్రొఫెసర్ పూస రమేష్ బాబు, పీయూ రిజిస్ట్రార్

ఐక్య పోరాటాలతోనే ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారం

» ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.సదానందంగౌడ్

నాగర్‌కర్నూల్ టౌన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఐక్య పోరాటాలతోనే ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారమవుతాయని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.సదానందంగౌడ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఎస్టీయూ జిల్లా కౌన్సిల్ సమావేశానికి రాష్ట్ర కార్యదర్శి జి.సదానందంగౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశంలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

జిల్లా నూతన అధ్యక్షుడిగా కొత్త శ్రీధర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా ఎస్.మురళి, కోశాధికారిగా హనుమంత్‌రెడ్డి, అడిషనల్ జనరల్ సెక్రటరీగా ఈశ్వర్, అసోసియేట్ అధ్యక్షుడిగా కె.కరుణాకర్‌రెడ్డి, పి.రవి, శేఖర్, డి.ప్రభాకర్, వి.సతీష్, కె.రమేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని ఏఐఎస్టీఎఫ్ ఉపాధ్యక్షుడు పరమేష్ ప్రమాణ స్వీకారం చేయించారు.



ఎస్టీయూ జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.సదానందంగౌడ్

కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఎం.పర్వత్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ఎస్.ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా బస్టాండ్

● మట్టి పోయించి చదును చేయించిన బీఆర్‌ఎస్ నాయకులు


పెంట్లవెల్లి బస్టాండ్‌లో టిప్పర్ల ద్వారా మట్టిని తరలిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

పెంట్లవెల్లి అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ నాయకులు పట్టించుకోకపోవడంతోనే బస్టాండ్‌లోకి బస్సులు సరిగా రావడం లేదని మాజీ సర్పంచు రాజేష్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పోతుల వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని బస్టాండ్‌లో లోతుగా గుంతలు ఏర్పడడంతో బస్సులు రాక పోకలకు తీవ్ర ఇబ్బందిగా ఏర్పడింది. స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు గమనించి మండల కేంద్రం నుంచి నేషనల్ హైవే కోసం మట్టిని తరలిస్తున్న టిప్పర్లను దారి మళ్లించి బస్టాండ్‌లో మట్టిపోయించారు. అనంతరం ఎక్స్‌కవేటర్‌తో మట్టిని చదును చేయించారు. వారు మాట్లాడుతూ బస్టాండ్ ఆవరణలోకి బస్సులు వెళ్లక పోవడంతో ప్రజలు నిత్యం ఇబ్బందులకు గురవుతున్నారన్నారు.

ఈ కార్యక్రమంలో సామాజిక నాయకులు మూలే మేఘరాజు, బీఆర్‌ఎస్ నాయకులు సురేందర్ గౌడ్, గోవురాజు, అబ్దుల్ హుస్సేన్, రఫియొద్దీన్, ముబీన్, మాచర్ల రవిగౌడ, కొత్త శివుడు తదితరులు ఉన్నారు.

బస్టాండ్ ముందు డ్రైవర్ల నిరసన

అంతకు ముందు బస్టాండ్‌లో గుంతలు ఎక్కువగా ఉండటంతో బస్టాండ్ ఆవరణలోకి బస్సులను తీసుకెళ్లలేమని ఆర్టీసీ డ్రైవర్లు బస్సులు ఆపి నిరసన తెలిపారు. ఆర్టీసీ అధికారులు సర్ది చెప్పడంతో బస్సులు రాకపోకలు కొనసాగాయి.

ఇందిరమ్మ ఇంటికి ఇసుక ఇవ్వరా?

» సోషల్ మీడియాలో హల్‌చల్


కాంగ్రెస్ నాయకులు అడ్డుకోవడంతో నిలిచిన ఇసుక టిప్పర్లు

రాజోలి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇంటికి కాంగ్రెస్ నాయకులే ఇసుక రానివ్వకుండా అడ్డుకుంటారా? అంటూ తుమ్మిళ్ల గ్రామస్థులు కొందరు చేసిన పోస్టింగ్ ఆదివారం సోషల్ మీడియాలో హల్‌చల్ అయ్యింది. రాజోలి మండలం తుమ్మిళ్ల గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక తీసేందుకు అనుమతులు రావడంతో అక్కడినుంచి ఇసుక జిల్లాకు టిప్పర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్నారు. కాగా, శనివారం తుమ్మిళ్ల గ్రామస్థులు ఇసుక రీచ్ దగ్గరకు వెళ్లి వాహనాలను అడ్డుకున్నారు. ఆదివారం దాకా ఆ వాహనాలు అలాగే ఉండటంతో గ్రామానికి చెందిన మరికొందరు ఆదివారం రీచ్ దగ్గరకు వెళ్లి 'ఇళ్లు మంజూరు చేసేది మీరే..! నిర్మాణం కోసం ఇసుక వెళ్లకుండా ఆపేది మీరే!' అంటూ సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. ఇసుక వాహనాలను గ్రామస్థులు ఆపలేదని, కొందరు అధికార పార్టీ నాయకులే అలా చేశారని, దీనివల్ల ఇందిరమ్మ లబ్ధిదారులు, టిప్పర్ డ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారని, ఆ ఇబ్బందికి మా గ్రామం కారణం కాకూడదని అన్నారు.

ఈ విషయాలు మాట్లాడుతూ.. వారు చేసిన పోస్టు ఆదివారం జిల్లాలోని పలు వాట్సప్ గ్రూప్‌లలో వైరల్‌గా మారింది. సాయంత్రానికి వాహనాలు బయటకు కదిలాయి.

పీడీఎస్ బియ్యం పట్టివేత

అయిజ, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని సివిల్ సప్లయ్ అధికారులు పట్టుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. అయిజ పట్టణంలోని గాజుల పేటవీధిలో సమాచారం మేరకు సివిల్ సప్లయ్ అధికారులు ఆదివారం సాయంత్రం తనిఖీ చేయగా వీరేంద్రగౌడు అనే వ్యక్తి అశోక్ లేలాండ్ వాహనంలో బియ్యం తరలిస్తున్నట్లు గుర్తించారని తెలిపారు. అందులో తనిఖీ చేయగా ప్రభుత్వం సరఫరా చేసిన పీడీఎస్ ప్యాకెట్లు మొత్తం దాదాపు 77 క్వింటాళ్ల వరకు ఉన్నట్లు గుర్తించారని వివరించారు. సంబంధిత వ్యక్తి అక్రమంగా బియ్యాన్ని తరలిస్తున్నాడని సివిల్ సప్లయ్ అధికారులు వీరేంద్రగౌడుపై ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

గ్రామాల్లో అధికారుల తనిఖీలు


సాతర్ల గ్రామసభలో వివరాలు సేకరిస్తున్న తనిఖీ బృందం

ఇటిక్యాల, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, పంచాయతీ రాజ్ శాఖ పరిధిలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఉమ్మడి ఇటిక్యాల మండలంలో 29 గ్రామాల్లో చేసిన పనులపై పూర్తి వివరాలు సేకరిస్తున్నారు. మండలంలో ఏప్రిల్ 2024 నుంచి మార్చి 2025 వరకు మండలంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ పరిధిలో వివిధ పనులకు గాను రూ.5,35,23,775, పంచాయతీరాజ్ శాఖ పరిధిలో రూ.1,97,62,956 పనులు, సామగ్రి రూపంలో ఖర్చు చేసినట్లు సామాజిక తనిఖీ ఎస్‌ఆర్‌పీ బద్రు ఆదివారం విలేకరులకు తెలిపారు. ఈనెల 9 నుంచి గ్రామాల్లో 16 వరకు పనులపై పూర్తి వివరాలను బృందం సభ్యులు గ్రామాలకు వెళ్లి సేకరిస్తున్నారు.

విధానమే.. నినాదమా?

(5వ పేజీ తరువాయి)

కొన్ని కొత్త పేర్లు కూడా తెరపైకి వస్తున్నాయి. దీనికి మరో కారణం కూడా ఉంది. రానున్న అసెంబ్లీ ఎన్నికల కంటే ముందే నియోజకవర్గాల పునర్విభజన జరగనుంది. ఇప్పుడు డీసీసీగా నియామకం అయితే జిల్లా స్థాయిలో ప్రజల దృష్టిలో పేరు రిజిస్టర్ అవుతుందని, స్థానికంగా ఉండి ఎమ్మెల్యే టికెట్ ఆశించొచ్చని భావిస్తున్న వారూ ఉన్నారు. అందుకే ఈసారి డీసీసీ అధ్యక్షుల విషయంలో చాలామంది పోటీ పడుతున్నారు. అయితే పార్టీ బీసీ విధానం ఎత్తుకోగా.. అదే నినాదంగా జిల్లా అధ్యక్షుల ఎంపిక చేపట్టాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది.

పాలమూరులో రెడ్డి వర్సెస్ నాన్‌రెడ్డి...

మహబూబ్‌నగర్ జిల్లా డీసీసీ అధ్యక్ష పదవి కోసం దాదాపు ఏడుగురు పోటీ పడుతున్నారు. ఆదివారం జిల్లాకు వచ్చిన ఏఐసీసీ పరిశీలకుడు నారాయణస్వామి ఎమ్మెల్యేలతో సమావేశం కాగా.. ఆరుగురి పేర్లను అధిష్ఠానానికి పంపుతామయని చెప్పారు. ఈ క్రమంలో ఎమ్మెల్యేలు, ఆశావహులు, కార్పొరేషన్ చైర్మన్లు, పార్టీ బాధ్యులతో మీటింగ్ అయిన సందర్భంలో పలు విషయాలను చర్చించారు. మహబూబ్‌నగర్‌లో ముగ్గురు రెడ్డి ఎమ్మెల్యేలు ఉన్నారు. పార్టీ విధానం ఇతర వర్గాలను ప్రోత్సహించడం కావడంతో ప్రస్తుతం డీసీసీ అధ్యక్ష పదవి ఆశిస్తున్న వారిలో బీసీ, ఎస్సీ, మైనారిటీల్లో ఎవరికో ఒకరికి అవకాశం ఇస్తే సముచితంగా ఉంటుందని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సూచించారు. మరోసారి రెడ్డీలకే ఇస్తే చెడు అభిప్రాయం పోతుందని చెప్పారు. ఎన్నికల ముందు నుంచి పార్టీలో ఉన్నవారికి ప్రాధాన్యం ఇవ్వాలని కోరినట్లు సమాచారం. ప్రస్తుత డీసీసీ అధ్యక్షుడు, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో తనకు మరోసారి అవకాశం ఇవ్వాలని కోరినట్లు తెలుస్తోంది. తాజాగా టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు జీవన్‌రెడ్డి పేరు తెరపైకి వచ్చింది. చాన్నాళ్ల తర్వాత ఆయన పార్టీ ఆఫీసుకు వచ్చారు. ఇదిలా ఉంటే బీసీల నుంచి ఎన్‌పీ వెంకటేష్, సంజీవ్ ముదిరాజ్, మైనారిటీల నుంచి సిరాజ్ ఖాద్రీ, జహీర్ అక్తర్, ఎస్సీల నుంచి వినోద్‌కుమార్ పోటీపడుతున్నారు. వీరిలో ఎవరికో ఒకరికి ఇవ్వాలని అనిరుధ్‌రెడ్డి కోరుతుండగా.. జీఎంఆర్, జీవన్‌రెడ్డి పేర్లు రెడ్డి సామాజికవర్గం నుంచి వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ పోటీ కాస్త రెడ్డి వర్సెస్ నాన్‌రెడ్డిగా మారే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. ఒకవేళ రెడ్డిలకే ఇచ్చేపక్షంలో తన సోదరుడు దుష్యంత్‌రెడ్డి కూడా బరిలో ఉంటారని ఒకరిద్దరితో అన్నట్లు సమాచారం.

శ్రీశైలం ప్రాజెక్టుకు తగ్గిపోయిన ఇన్‌ఫ్లో

» మూసుకున్న జూరాల ప్రాజెక్టు గేట్లు

గద్వాల, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : వర్షాలు తగ్గిపోవడంతో కృష్ణా ప్రాజెక్టులకు ఇన్‌ఫ్లో తగ్గిపోయింది. దీంతో ప్రాజెక్టుల గేట్లు మూత పడుతున్నాయి. శనివారం ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టుల గేట్లు మూతపడగా, ఆదివారం జూరాల ప్రాజెక్టు గేట్లు మూతపడ్డాయి. విద్యుత్ ఉత్పత్తి మాత్రమే కొనసాగుతున్నది. జూరాలకు 55 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 45,587 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టుకు 80,699 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో మాత్రమే వచ్చి చేరుతోంది. ఒక గేటును ఎత్తి 27,891 క్యూసెక్కులను నాగార్జునసాగర్‌కు నీటిని విడుదల చేస్తున్నారు. విద్యుత్ ఉత్పత్తితో పాటు కాలువలు, ఎత్తిపోతల ద్వారా 70,008 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 215.80 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 213.40 టీఎంసీల నీరు నిల్వ ఉంది. తుంగభద్ర నుంచి సుంకేసుల డ్యామ్‌కు 15 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, 11 వేల క్యూసెక్కుల నీటిని శ్రీశైలం ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు.

వీధి కుక్కల దాడి

» ఐదుగురు చిన్నారులకు గాయాలు


గాయపడిన అభిజిత్

ఊట్కూర్/చారకొండ, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): వీధి కుక్కల దాటిలో ఐదుగురు చిన్నారులు గాయపడ్డారు. నారాయణపేట జిల్లా ఊట్కూర్, నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండలో ఆదివారం ఈ ఘటనలు చోటు చేసుకున్నాయి. ఊట్కూర్ మండల కేంద్ర శివారులో ఉన్న శ్రీనివాసకాలనీలో ఆదివారం నక్క శ్రావణ్ కుమారుడు అభిజిత్‌తో పాటు, మరి కొద్ది దూరంలో ఉన్న బుడ గజంగాల పిల్లలు ఇళ్ల ముందు ఆడుకుంటుండగా వీధి కుక్కలు ఒక్కసారిగా వచ్చి చిన్నారులపై దాడి చేశాయి. చిన్నారుల అరుపులతో ఇళ్లల్లో ఉన్న తల్లిదండ్రులతో పాటు చుట్టు పక్కల వారు బయటికి వచ్చి కుక్కలను తరిమివేశారు. అప్పటికే అభిజిత్ చెంపపై, తలపై, కుడికాలును తీవ్రంగా గాయపర్చాయి. అలాగే బుడగ జంగాల కుటుంబాలకు చెందిన మరో ముగ్గురు చిన్నారులు విశ్వఅద్విత్, రాకేష్, రవిల కాళ్లకు సైతం గాయాలు కావడంతో గ్రామస్థుల సూచన మేరకు తల్లిదండ్రులు అప్పంపల్లి గ్రామం వద్ద ఉన్న ప్రభుత్వ మెడికల్ కళాశాల ఆసుపత్రికి తీసుకెళ్లారు. గ్రామంలో వీధి కుక్కలు పెరిగిపోయి బయట ఆడుకుంటున్న చిన్నారులతో పాటు పశువులపై సైతం దాడులు చేస్తున్నాయని గ్రామస్థులు వాపోయారు.

అగ్రహారం తండాలో

చారకొండ, (ఆంధ్రజ్యోతి): చారకొండ మండలంలోని అగ్రహారం తండాలో వీధి కుక్కల బెడద ఎక్కువైందని, వాటినుంచి కాపాడాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఆదివారం గ్రామానికి చెందిన బాలుడు నేనావత్ వర్షిత్ వీధి కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో వర్షిత్ తల్లిదండ్రులు కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ కొన్ని రోజుల నుంచి గ్రామంలో వీధి కుక్కల బెడద ఎక్కువైందని, ఈ విషయంపై గ్రామ కార్యదర్శితో పాటు గ్రామ సభలో విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదని అన్నారు. రాత్రి సమయంలో వ్యవసాయ పొలాల వద్దకు వెళ్లాలంటేనే వీధి కుక్కలు ఎప్పుడు వచ్చి కాటేస్తాయోనని భయాందోళన చెందుతున్నారని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధి కుక్కల బెడద నుంచి కాపాడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

క్రైం కార్నర్

ఉరి వేసుకొని యువకుడి ఆత్మహత్య


కొమ్ము రామకృష్ణ (ఫైల్)

నాగర్‌కర్నూల్ క్రైం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రేమించిన అమ్మాయిని పెళ్లికి పెద్దలు నిరాకరించడంతో ఉరి వేసుకొని కొమ్మ రామకృష్ణ(25) అనే యువకుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్‌ఐ గోవర్ధన్ ఆదివారం తెలిపారు. వివరాల ప్రకారం... కొల్లాపూర్ పట్టణానికి చెందిన రామకృష్ణ కొంతకాలంగా జిల్లా కేంద్రంలోని రాఘవేంద్ర కాలనీలో తనకు వరుసకు చిన్నాయన దగ్గర ఉండి కొల్లాపూర్ చౌరస్తాలో బైక్ మెకానిక్ చేస్తున్నాడు. రామకృష్ణకు తల్లిదండ్రులు చనిపోవడంతో అన్న హైదరాబాద్‌లో కూలీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తాను చిన్నాన్న దగ్గరుండి కొల్లాపూర్ చౌరస్తాలో బైక్‌మెకానిక్ పని చేసుకుంటూ ఒక అమ్మాయిని ప్రేమించాడు. ప్రేమించిన అమ్మాయితో పెళ్లికి అమ్మాయి తల్లిదండ్రులు ఒప్పుకోకపోవడంతో మనస్తాపానికి గురైన రామకృష్ణ శనివారం రాత్రి రాఘవేంద్రకాలనీలో చిన్నాన్న ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటనకు మృతుని అన్న కొమ్ము సలేశ్వరం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి


ఇప్పలపల్లి బంగారి (ఫైల్)

తిమ్మాజిపేట, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మారేపల్లి గ్రామానికి చెందిన ఇప్పలపల్లి బంగారి(23) అనే యువకుడు ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. జడ్చర్లలో పనులు ముగించుకుని తిమ్మాజిపేటకు బైకుపై వస్తుండగా కిష్టంపల్లి సమీపంలోని మూలమలుపు దగ్గర ఎదురుగా వస్తున్న ఆటో బైకును ఢీకొట్టడంతో అతను అక్కడికక్కడే మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. సంఘటన స్థలానికి విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దోమ వెంకటేశ్, మల్లయ్య, శ్రీనివాసులు పలువురు వెళ్లారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి ..

నాగర్‌కర్నూల్ క్రైం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : అనుమానాస్పద స్థితిలో మైనగాని రాముడు (37) అనే వ్యక్తి మృతి చెందినట్లు ఎస్‌ఐ గోవర్ధన్ ఆదివారం తెలిపారు. వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ మండలం శ్రీపురం గ్రామానికి చెందిన రాముడు కొంతకాలంగా జిల్లా కేంద్రంలో ప్లంబర్ పని చేస్తూ జీవిస్తున్నాడు. 14 ఏళ్ల క్రితం గుడిపల్లికి చెందిన మానసతో ఇతనికి వివాహమైంది. ఈ నెల 9న బంధువుల పెళ్లికి గుడిపల్లికి వెళ్లాడు. శనివారం రాత్రి గుడిపల్లి నుంచి నాగర్‌కర్నూల్ బైకుపై వస్తూ గుడిపల్లి సమీపంలోని కంకర క్రషర్ దగ్గర విగతజీవిగా కన్పించాడు. బైక్‌పై పడి ఉన్న విషయాన్ని గుడిపల్లి గ్రామానికి చెందిన సురేష్ చూసి రాము బంధువులకు సమాచారం అందించాడు. కుటుంబ సభ్యులు వచ్చి రాముడును ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను మృతిచెందినట్లు ధ్రువీకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.

ఈ సంఘటనపై మృతుడి తండ్రి మైనగాని పాండయ్య తన కోడలిపై, మరోవ్యక్తిపై అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేశాడని ఎస్‌ఐ తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కుప్పకూలి వివాహిత..

ధరూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ధరూర్ మండల కేంద్రంలో వ్యవసాయ పనులు ముగించుకుని ఓ వివాహిత ఇంటి వస్తున్న క్రమంలో ద్విచక్ర వాహనం ఎక్కబోయి హఠాత్తుగా కుప్పకూలింది. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే గద్వాల ఏరియా ఆస్పత్రికి తరలించగా, అప్పటికే వైద్యులు మృతి చెందిందని తెలిపారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... ధరూర్‌కు చెందిన కురువ రమేశ్ భార్య మానస(24) ఆదివారం వ్యవసాయ పొలానికి వెళ్లింది. సాయంత్రం పనులు ముగించుకుని ఇంటికి వస్తున్న క్రమంలో ద్విచక్ర వాహనం ఎక్కబోతూ హఠాత్తుగా కుప్పకూలింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే గద్వాల ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మానసకు తొమ్మిది నెలల చిన్నారి ఉందని, ఏడాదిన్నర క్రితమే వివాహమైందని కుటుంబ సభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న ధరూర్ ఎస్‌ఐ కొండా శ్రీహరి గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకుని వైద్యులతో పాటు కుటుంబసభ్యులతో సమాచారం సేకరించారు.

ఆగి ఉన్న కంటైనర్‌ను ఢీకొని ద్విచక్ర వాహనదారుడికి తీవ్ర గాయాలు

కృష్ణ, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న కంటైనర్‌ను ఢీకొని ద్విచక్ర వాహనదారుడికి తీవ్ర గాయాలైన సంఘటన నారాయణపేట జిల్లా కృష్ణ మండలం గుడెబల్లూరు గ్రామ శివారులోని 150వ జాతీయ రహదారిపై ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం రాయచూర్ జిల్లా దేవసూగూరు మండల పరిధిలోని ఘంజహళ్లి గ్రామానికి చెందిన జనార్ధన్ హిందూపూర్ గ్రామంలో పనులు ముగించుకొని తన ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ప్రమాదవశాత్తు జాతీయ రోడ్డు పక్కన నిలిచిన కంటైనర్‌కు ఢీకొని కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గుర్తించి జనార్ధన్‌ను రాయచూర్ ఆసుపత్రికి తరలించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మిడ్జిల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వాడియాల గ్రామ శివారు దుందుభి వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివనాగేశ్వర్‌నాయుడు ఆదివారం తెలిపారు. ఎస్‌ఐ కథనం ప్రకారం.. ఆదివారం తెల్లవారుజామున అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారనే సమాచారం రావడంతో తమ సిబ్బంది అక్కడికి వెళ్లి ట్రాక్టర్‌ను పట్టుకొని, డ్రైవర్ కుర్వ మల్లేష్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

యువతి ఫొటోలతో నకిలీ ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్

» కేసు నమోదు చేసిన పోలీసులు

మిడ్జిల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన ఓ యువతి ఫొటోలను ఉపయోగించి నకిలీ ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ సృష్టించిన ఘటన సంచలనంగా మారింది. అదే గ్రామానికి చెందిన అవేజ్ అనే వ్యక్తి ఇన్‌స్టాగ్రామ్‌లో నకిలీ ఖాతాను తయారు చేసి యువతి ఫొటోలను పోస్ట్ చేసినట్లు ఎస్‌ఐ శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు. విషయం తెలిసిన ఆమె తండ్రి ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇసుక లారీ పట్టివేత


పట్టుపడిన అక్రమ ఇసుక లారీ

అలంపూరుచౌరస్తా, అక్టోబరు 12, (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అలంపూరు చౌరస్తాలో ఆదివారం పోలీసు సిబ్బంది అబ్దుల్‌బాషా, రవి వాహనాల తనిఖీ చేపట్టారు. అనుమానాస్పదంగా వస్తున్న లారీని ఆపి తనిఖీ చేయగా ఇసుక ఉండ టంతో డ్రైవర్ కేతవత్ బాలు ను అనుమతి పత్రాలు అడి గారు. పర్మిషన్ లేకుండానే తాడిపత్రి నుంచి హైదరాబాద్‌కు ఇసుక రవాణా చేస్తున్నట్లు తేలడంతో వాహనాన్ని స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేసినట్లు ఎస్సై శేఖర్ తెలిపారు.

ఉత్సవ విగ్రహాలుగా ఆలయ కమిటీలు

» ఆలయ ఆస్తులు అద్దెకిచ్చినా వసూలు కాని వైనం
» దూపదీప నైవేద్యానికి కూడా నిధుల లేమి
» కమిటీలు ఏర్పాటై ఏడాది గడిచినా కానరాని అభివృద్ధి


వేణుగోపాలస్వామి ఆలయం


వేణుగోపాలస్వామి మూలవిరాట్

కోస్గి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): దేవాదాయ శాఖవారు ఏర్పాటు చేసిన కమిటీలు కోస్గిలో ఉత్సవ విగ్రహాలుగా మారాయి. కోస్గి పట్టణంలోని వేణుగోపాలస్వామి, శంభునిగుడి కమిటీలు ఏర్పాటై ఏడాది కావస్తున్నా కమిటీ సభ్యులు చొరవ తీసుకొని ఏ పనీ చేపట్టడంలేదు. వేణుగోపాలస్వామి ఆలయానికి 1804, 1805 1808, సర్వే నెంబర్‌లలో భూములు ఉన్నాయి. కోస్గి శివారులో ఉన్న ఈ భూమిని మునిసిపాలిటీ వారు పశువుల సంత నిర్వహణ కోసం మూడేళ్ల క్రితం నెలకు రూ.50 వేలు అద్దె ఇస్తామని మూడెకరాల భూమిని తీసుకున్నారు. ఆలయ భూమిలో పశువుల సంత కొనసాగుతోంది కానీ ఏ ఒక్క నెల కూడా అద్దె చెల్లించలేదని దేవాదాయ శాఖ అధికారులు చెబుతున్నారు. ఎప్పుడు అడిగినా ఇప్పుడు.. అప్పుడు అంటు కాలయాపన తప్ప అద్దె ఇవ్వడం లేదని వారు పేర్కొన్నారు. నిజానికి ఆలయంలో నిత్యపూజలు, దూపదీప నైవేద్యం, పూజారి వేతనం అంతా కూడా ఆలయ ఆస్తుల నుంచి వచ్చిన సొమ్మును ఆలయ ఖాతాలో జమచేసి నెలవారీగా కావాల్సినంత కమిటీ సభ్యులు, దేవాదాయ శాఖ అధికారి ద్వారా డ్రా చేసి వాడుకుంటారు. కానీ ఇక్కడ అదంతా జరగడం లేదు. ఆలయానికి కోట్ల రూపాయల విలువ గల భూములు ఉన్నా దూపదీప నైవేద్యానికి డబ్బులు అందడం లేదు. అదేవిధంగా శంభునిగుడి పరిస్థితి కూడా అంతగానే ఉంది. కమిటీ ఏర్పాటై ఏడాది గడుస్తున్నా నేటికీ ఆలయంలో నిత్యపూజలు జరగడం లేదు. ఇక్కడ ఆలయంలో స్వామివారి విగ్రహం భిన్నమైందని నూతన శివలింగం ప్రతిష్ఠించాలని పూజారులు చెబుతున్నారు.

దేవుడు కరుణించినా పూజారి వరమివ్వలేదన్నట్లుంది కమిటీల పరిస్థితి

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వేణుగోపాలస్వామి, శంభుని గుడి ఆలయాల అభివృద్ధికి రూ.2 కోట్లు ఇస్తామని హామీ ఇచ్చిన కమిటీ సభ్యులు ముఖ్యమంత్రిని కలిసి సంబంధిత శాఖ అధికారులతో సమన్వయం చేసుకొని నిధులు తెచ్చుకోవడంలో విఫలమవుతున్నారు.

ఆలయానికి ఎంతో విశిష్టత ఉంది..

వేణుగోపాలస్వామి ఆలయానికి చాలా విశిష్టత ఉంది. 500 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ ఆలయంలో ఉన్న అభయాంజనేయస్వామి విగ్రహం కర్ణాటకలోని హంపి తరువాత ఇక్కడే ఉంది. ఇలాంటి విగ్రహం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కడా లేదు. అయితే నిజాం నవాబుల పరిపాలనలో శిఖరాలు ఉన్న ఆలయాలను కూల్చివేస్తుండడంతో వేణుగోపాలస్వామి ఆలయాన్ని అప్పట్లోనే శిఖరం లేకుండా నిర్మించారు.

\- ఆలయ పూజారి జయతీర్థాచారి

మునిసిపాలిటీ వారు అద్దె ఇవ్వడం లేదు..

మూడుళ్లుగా అగ్రిమెంట్ ప్రకారం మునిసిపాలిటీ వారు అద్దె ఇవ్వడం లేదు. దీంతో ఆలయంలో దూపదీప నైవేద్యానికి నిధులు లేకుండా పోయాయి. ఈ విషయంపై మునిసిపల్ కమిషనర్‌ను ప్రశ్నిస్తే ఇప్పుడు.. అప్పుడంటూ కాలయాపన చేస్తున్నారు. ఆలయ నిధులు జమ చేసేందుకు ఆలయం పేరిట బ్యాంకు ఖాతా కూడా తెరిచాం.

\- రాజేందర్‌రెడ్డి, దేవాదాయ శాఖ ఈవో

దీంతో ఆలయాలు అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఇప్పటికైనా ఆలయ కమిటీ సభ్యులు స్పందించి సంబంధిత శాఖ అధికారులతో సమన్వయం చేసుకొని ముఖ్యమంత్రి ద్వారా నిధులు తెచ్చుకొని ఆలయాలను అభివృద్ధి చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఆర్థోపెడిక్ శస్త్ర చికిత్సల్లో అత్యాధునిక విధానాలు

» ఎస్వీఎస్ మెడికల్ కళాశాల, ఆసుపత్రి ఎండీ డాక్టర్ కేజే రెడ్డి
» రివిజన్ ఆర్థోసర్జరీలపై లైవ్ ప్రదర్శన
» ముగిసిన రాష్ట్రస్థాయి ఆర్థరైటిస్ అవగాహన సదస్సు


మాట్లాడుతున్న డాక్టర్ కేజే రెడ్డి

మహబూబ్‌నగర్ వైద్యవిభాగం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఆర్థోపెడిక్, ఆర్థరైటిస్ శస్త్రచికిత్సల్లో అత్యాధునిక పద్ధతులు, పరికరాలతో వైద్యం అందుబాటులోకి వచ్చిందని ఎస్వీఎస్ మెడికల్ కళాశాల, ఆసుపత్రి ఎండీ, నీ రీప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ కేజే రెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ ఆర్థరైటిస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎస్వీఎస్ ఆసుపత్రి, వైద్య కళాశాలలోని ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి ఆర్థరైటిక్ అవగాహన సదస్సు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వళన చేసి, మాట్లాడారు. ఆర్థోపెడిక్ సర్జరీలలో ప్రపంచస్థాయి వైద్యరంగంలో అవలంబిస్తున్న శస్త్రచికిత్స పద్ధతులు, ఆధునిక విధానాలను రాష్ట్రంలోని ఆర్థోపెడిక్ సర్జన్లకు పరిచయం చేసేందుకు ఈ సదస్సును ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుత సమాజంలో వయసుతో పనిలేకుండా మోకాలు, కీళ్లనొప్పులతో బాధపడుతున్నారని, అయితే అవగాహన లేకపోవడంతో ముందస్తుగా గుర్తించకపోవడం వల్ల శస్త్రచికిత్సల వరకు వస్తున్నారన్నారు.

ఇది వరకు ఆర్థరైటిస్‌తో పాటు ఆర్థోపెడిక్‌కు సంబంధించి అన్ని రకాల సర్జరీలు చేసిన తర్వాత ఇన్‌ఫెక్షన్ వల్ల ఫెయిల్ అయిన సర్జరీలను, నీరీప్లేస్‌మెంట్ అయిన తర్వాత కూడా ఫెయిల్ అయిన సర్జరీలను ఎలా సరిదిద్దాలనే అంశాలపై లైవ్ సర్జరీలు చేసి, అవగాహన కల్పించారు.

ఉదయం 9 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు లైవ్ సర్జరీలు కొనసాగాయి. ఎస్వీఎస్ విద్యాసంస్థ చైర్మన్ కృష్ణారెడ్డి, ఎండీలు డాక్టర్ వెంకట్‌రెడ్డి, రాంరెడ్డి, రాష్ట్రంలోని దాదాపు 350 మంది వరకు ఆర్థోపెడిక్ డాక్టర్లు పాల్గొన్నారు.

బడి దూరమని పదోన్నతికి కొర్రీ

» పదోన్నతులకు మొగ్గుచూపని జీహెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు
» ఉపాధ్యాయులు లేక విద్యార్థుల చదువుపై ప్రభావం

వనపర్తి విద్యా విభాగం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం గత నెలలో ప్రభుత్వ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించింది. దీంతో ఎప్పుడు పదోన్నతులు కల్పిస్తారా అని ఎదురుచూస్తున్న కొందరు ఉపాధ్యాయులకు ఎంతగానో ఊరట కలిగింది. రాష్ట్ర ప్రభుత్వం స్కూల్ అసిస్టెంట్లను ప్రధానోపాధ్యాయులుగా, ఎస్జీటీలను స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించింది. జిల్లాలో మెజారిటీ ఉపాధ్యాయులు తమకు కేటాయించిన పాఠశాలలో చేరగా, మరి కొంతమంది ఉపాధ్యాయులు పదోన్నతులు తిరస్కరించి, పాత క్యాడర్ లోనే కొనసాగుతున్నారు. ఫలితంగా సీనియారిటీలో తరువాత ఉన్నవారు నష్టపోగా, పలు పోస్టులు ఖాళీగానే మిగిలిపోయాయి. 8 మంది జీహెచ్‌ఎంలు, 8 మంది ఉపాధ్యాయులు పదోన్నతులకు దూరంగా ఉన్నారు.

● జిల్లా వ్యాప్తంగా అర్హులైన ఎస్జీటీలకు, స్కూల్ అసిస్టెంట్‌గా 76 మందికి ఆయా సబ్జెక్టుల్లో పదోన్నతులు లభించాయి. వీరిలో 68 మంది మాత్రమే వారికి కేటాయించిన పాఠశాలలో చేరారు. మిగిలిన 8 మంది పాత క్యాడర్‌లోనే ఉండిపోయారు. పీఎస్ హెచ్‌ఎం 4 (చిన్నంబావి మండలం, దగడ, అయ్యవారిపల్లి, అమరచింత డీఎంఆర్‌ఎం, అమరచింత మండల ఈర్లదిన్నె) ఖాళీగా ఉన్నాయి. బయోసైన్స్ 2 (చిన్నంబావి మండలం బెక్కెం, శ్రీరంగాపురం మండలం వెంకటాపూరం) ఖాళీగా ఉన్నాయి. సోషల్-1 (ఘణపూర్ మండలం మల్కాపూర్) ఖాళీగా ఉంది. ఫిజిక్స్ 1 (చిన్నంబావి మండలం వెల్టూర్) మాథ్స్ 1 (ఆత్మకూరు గర్ల్స్) పోస్టు ఖాళీగా ఉంది.

● మల్టీ జోనల్-2 పరిధిలో జిల్లాకు 23 మంది ప్రధానోపాధ్యాయులకు కేటాయించగా, వీరిలో 15 మంది మాత్రమే వారికి కేటాయించిన పాఠశాలలో చేరారు. మిగిలిన ఎనిమిది మంది అమరచింత (బాలికల పాఠశాల), బుద్ధారం, రేవల్లి, బొల్లారం, వీపనగండ్ల (బాలికలు), తూముకుంట, చిన్నంబావి మండలం అయ్యవారిపల్లి ఇప్పటి వరకు ప్రధానోపాధ్యాయులు చేరలేదు.

కారణాలు అనేకం...

1. మల్టిజోనల్ పరిధిలో ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి పొందిన వారు దూర ప్రాంతాలకు కేటాయించారు అనే సాకుతో ఇక్కడికి రాలేదు.

2. పదోన్నతి పొందిన ప్రధానోపాధ్యాయులు చేరకపోవడంతో జిల్లాలో 8 పాఠశాలలో జిహెచ్‌ఎంలు లేక ఖాళీగా ఉన్నాయి. ఇతర జిల్లాల నుంచి కేటాయించిన వారే తిరస్కరించిన వారిలో ఉన్నారు.

3. ఉన్నత పాఠశాలలో పనిభారం, పదోన్నతి కల్పించిన బడులు దూరభారం కావడంతో చేరలేదు.

4. బోధనలో కొత్త సంస్కరణలు, వృత్తి నైపుణ్యాలను ప్రభుత్వం పెంచుతున్న, ఉపాధ్యాయులు వివిధ కారణాలతో పదోన్నతులకు దూరంగా ఉండటంతో విద్యార్థుల చదువుపై తీవ్ర ప్రభావం పడుతుంది.

రూ.258 కోట్లతో సోలార్ పంపుసెట్లు

» అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ
» సీఎం సొంత మండలం వంగూరు పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

వంగూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): రైతులందరికీ సోలార్ పంపుసెట్లు అందించనున్నదని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండల కేంద్రంలో ఆయన ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి సొంత మండలమైన వంగూరును పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి రూ.258 కోట్లతో సోలార్ పంపుసెట్లు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. మండలంలోని 7,500 బోర్లకు సోలార్ ప్లేట్ల ఏర్పాటుకు అనుమతి వచ్చిందని ఆయన తెలిపారు. సోలార్ పంపుసెట్ల ద్వారా రైతులకు విద్యుత్ చార్జీలు పూర్తిగా తగ్గి ఆదాయం పెరిగేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షించదగ్గ విషయమన్నారు. మండలంలో ప్రభుత్వ భవన నిర్మాణాలకు రూ. 30 కోట్లు మంజూరైనట్లు ఆయన తెలిపారు. వంగూరు గేటు నుంచి వంగూరు వరకు నాలుగు లేన్ల రహదారి మంజూరుకు కృషి చేస్తానన్నారు. సమావేశంలో అచ్చంపేట నియోజవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు క్యామ మల్లయ్య, మాజీ ఎంపీటీసీ రమేష్ గౌడ్, ఎర్ర తిరుమలయ్య, జనార్దన్, సతీష్‌రెడ్డి, అర్కపల్లి కృష్ణయ్య, హరీశ్‌రెడ్డి, జగతయ్య, తదితరులు ఉన్నారు.

ఆయిల్ పాం తోటల పరిశీలన


పెద్దకార్పాములలో ఆయిల్‌పాం తోటలను పరిశీలిస్తున్న ఉద్యానవన శాఖ అధికారి లక్ష్మణ్

పెద్దకొత్తపల్లి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పెద్దకార్పాముల గ్రామంలో రైతు సాయిప్రకాశ్‌రెడ్డి సాగు చేసిన ఆయిల్‌పామ్ తోటలను ఆదివారం కొల్లాపూర్ డివిజన్ ఉద్యానవన అధికారి ఎం.లక్ష్మణ్ పరిశీలించారు. ఆయిల్‌పామ్ తోటలు సాగు చేసి మూడేళ్లు పూర్తై నాల్గో సంవత్సరంలోకి రావడంతో కాపు కాసిన ఆయిల్‌పామ్ చెట్టు గెలలు కోసే ప్రక్రియను ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లోను ఆయిల్‌పామ్ చెట్ల కొమ్మలను నరకకూడదని, క్రమం తప్పకుండా నీరు, ఎరువులను అందించినట్లయితే మనం ఆశించిన దాని కంటే ఎక్కువ దిగుబడి పొందవచ్చునని అధికారి తెలిపారు.

కుమార్తెతో కనిపించిన యువకుడు

» పట్టుకునేందుకు తండ్రి యత్నం
» తప్పించుకునే యత్నంలో కత్తితో దాడి
» గతంలోనే గ్రామంలో పంచాయితీ

ఊట్కూర్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : తన కుమార్తెతో ఓ యువకుడు సన్నిహితంగా మాట్లాడుతుండగా తండ్రి చూసి పట్టుకునేందుకు యత్నించాడు. తప్పించుకునే క్రమంలో ఆ యువకుడు అతడిపై కత్తితో దాడి చేసి గాయపరిచాడు. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ సంఘటన నారాయణపేట జిల్లా, ఊట్కూరు మండలంలోని ఓ గ్రామంలో జరిగింది. ఊట్కూరు ఎస్‌ఐ రమేశ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన యువతితో అదే ఊరికి చెందిన జంజర్ల నరేశ్ అనే యువకుడు కొంతకాలంగా సన్నిహితంగా ఉంటున్నాడు. విషయం తెలుసుకున్న ఆమె తండ్రి మందలించడంతో పాటు గ్రామంలో పంచాయితీ పెట్టించాడు. అలాంటిది ఏమీ లేదని, కావాలని నిందలు వేస్తున్నారని ఆ యువకుడి కుటుంబ సభ్యులు చెప్పారు. ఇద్దరూ కలిసి ఉన్నప్పుడు ప్రత్యక్షంగా చూసి పట్టుకొని, అప్పుడు చెప్పాలన్నారు. ఈ క్రమంలో గత శుక్రవారం నరేశ్ ఆ యువతితో కలిసి మాట్లాడుతుండగా, ఆమె తండ్రి గమనించి, పట్టుకునేందుకు యత్నించాడు. దీంతో అతడు తన వెంట తెచ్చుకున్న కత్తితో దాడికి యత్నించాడు. చేయి అడ్డు పెట్టడంతో బలమైన గాయమైంది. కుటుంబ సభ్యులు అతడిని ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. సంఘటనపై శనివారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రెండు దూడలకు జన్మనిచ్చిన పాడి ఆవు

» హర్షం వ్యక్తం చేస్తున్నరైతు రాఘవేందర్ యాదవ్


బొమ్మరాజుపల్లిలో రెండు దూడలకు జన్మనిచ్చిన పాడి ఆవు

ఊర్కొండ, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలం బొమ్మరాజుపల్లి గ్రామంలో రాఘవేందర్ యాదవ్ పాడి ఆవు శనివారం రాత్రి రెండు దూడలకు జన్మనిచ్చింది. దాంతో రైతు కుటుంబం హర్షం వ్యక్తం చేసింది. గ్రామ శివారులోని షెడ్‌లో ఉన్న ఆవు, దూడలను చూసి పలువురు రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

చీరాల ఓడరేవు బీచ్‌లో..
జడ్చర్ల విద్యార్థి మృతి


మణిదీప్ (ఫైల్)

జడ్చర్ల, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చీరాల ఓడరేవు బీచ్‌లో మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల పట్టణానికి చెందిన బాదం మణిదీప్ (20) మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. పట్టణానికి చెందిన బాదం రాఘవేందర్ ఆటోఫైనాన్స్ అండ్ చిట్ ఫండ్ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. రాఘవేందర్‌కు ఇద్దరు కుమారులు. వీరిలో పెద్ద కుమారుడు మణిదీప్, చిన్న కుమారుడు హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో ఇంటర్ చదువుతున్నాడు. విజయవాడలోని వీఐటీ కళాశాలలో మణిదీప్ బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు.

సెలవు దినం కావడంతో స్నేహితులతో కలిసి చీరాల పరిధిలోని వాడరేవు బీచ్‌కు వెళ్లారు. వీరంతా బీచ్‌లో సరదగా గడుపుతుండగా ఐదుగురు స్నేహితులు నీళ్లలో మునిగారు. అందులో మణిదీప్‌తో పాటు హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు, చీరాలకు చెందిర మరో ఇద్దరు ఉన్నారు. నీటిలో మునిగిన వీరిని స్థానికులు బయటికి తీసేలోగా మృతి చెందారు. స్నేహితులతో సరదాగా బీచ్‌కు వెళ్లి మృతి చెందడంతో వారి కుటుంబంలో విషాదం చోటుచేసుకుంది.

న్యూస్ బాక్స్..

కొనసాగుతున్న నీటి విడుదల

దేవరకద్ర, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నుంచి కుడి, ఎడమ కాల్వ ద్వారా రైతులు సాగు చేసుకున్న వరి పంటకు నీటి విడుదల కొనసాగుతున్నట్లు ప్రాజెక్టు ఈఈ ప్రతాప్‌సింగ్ తెలిపారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 32.5 అడుగులు కాగా, ఆదివారం సాయంత్రం నాటికి 32 అడగులకు చేరింది. రైతులు సాగు చేసుకున్న పంటలకు నీటిని పొదుపుగా వాడుకోవాలని, ప్రాజెక్టులోకి పై నుంచి నీరు తగ్గడంతో గేట్లు మూసివసినట్లు తెలిపారు.

పోచమ్మ ఆలయం ప్రారంభం

మహమ్మదాబాద్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన పోచమ్మ ఆలయ ప్రారంభోత్సవాలు రెండు రోజులుగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా పోచమ్మ, నాగులు, సప్తమాతృకల ప్రతిష్ఠాపన, వేద పండితులచే మహాగణపతి పూజ, అఖండ దీపారాదన, పుణ్యాహవాచనము, కలశ స్థాపన, సకల దేవతల ఆహ్వానం కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం హోమం, యంత్రప్రతిష్టాపన చేశారు.

వ్యాపారులు నిబంధనలు పాటించాలి

మహబూబ్‌నగర్ న్యూటౌన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : దీపావళి పండుగ సందర్భంగా పటాకులు విక్రయించే వ్యాపారులు నిబంధనలు పాటించాలని ఎస్పీ జానకి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎక్స్‌ప్లోజివ్ యాక్ట్ 1884, ఎక్స్‌ప్లోజివ్ రూల్స్ 2008 ప్రకారం అనుమతి తీసుకోవాలన్నారు. పటాకుల విక్రయ దుకాణాలు సంబంధిత తహసీల్దార్, ఫైర్ విభాగం, పోలీసు అధికారులు సూచించిన ప్రాంతాల్లో లైసెన్సులు కలిగిన వ్యాపారులు షాపులు నిర్వహించాలన్నారు. గడువు ముగిసిన వారు ముందస్తు పర్మిషన్, రెన్యువల్ చేసుకున్న తరువాతే పటాకులు విక్రయించాలని. లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రతీ పౌరుడు బాధ్యతగా మెలగాలి : డీఎస్పీ

బాలానగర్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ పౌరుడు బాధ్యతగా మెలగాలని డీఎస్పీ రమణారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన కార్డెన్ సెర్చ్‌లో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా పోలీసులు బృందాలుగా విడిపోయి వివిధ ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టి, అనుమానాస్పద వ్యక్తులను ఆరా తీశారు. ధ్రువీకరణ పత్రాలు లేని 30 మోటర్ బైక్‌లు, 6 ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. ఇతర ప్రాంతాల నుంచి ఫ్యాక్టరీల్లో పనిచేసే వారి పూర్తి సమాచారం తెలుసుకున్న తరువాతే ఇళ్లు అద్దెకు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జడ్చర్ల సీఐ నాగార్జున, పట్టణ సీఐ కమలాకర్, ఉమెన్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్ఐ లెనిన్ పాల్గొన్నారు.

బోలేమాన్ కుంటకు గండి



వృథాగా పారుతున్న నీరు

నవాబ్‌పేట, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి వర్షాలు కురవడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. అయితే పలు గ్రామాల్లోని చెరువులు, కుంటల కట్టలు పాత బడటంతో ఆందోళన చెందుతున్నారు. నెల రోజుల క్రితం చౌదూర్ చెరువుకు గండీ పడగా అధికారులు స్పందించి మరమ్మతు చేపట్టారు. తాజాగా మండలంలోని కూచూర్ గ్రామ శివారులోని బోలెమాన్ కుంటకు గండి పడి నీరు వృథాగా పోతుంది. గమనించిన రైతులు అధికారులకు సమాచారం ఇచ్చారు.

విగ్రహం ఏర్పాటుకు భూమి పూజ

హన్వాడ, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దదర్పల్లిలో సర్దార్ పాపన్నగౌడ్ విగ్రహం ఏర్పాటుకు ఆదివారం గౌడ సంఘం నాయకులు భూమి పూజ చేశారు. సింగిల్ విండో వైస్ చైర్మన్ కృష్ణయ్యగౌడ్, మాజీ సర్పంచ్ వెంకన్న, గౌడ సంఘం నాయకులు ప్రవీణ్‌గౌడ్, రాములు, సుమన్, మల్లేష్, యాదయ్య పాల్గొన్నారు.

యూరియా తిని 12 మేకలు మృతి

నవాబ్‌పేట, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : యూరియా బుక్కి 12 మేకలు మృతి చెందాయి. ఈ సంఘటన మండలంలోని అమ్మాపూర్‌లో ఆదివారం చోటు చేసుకుంది. బాధితుడు ప్రభాకర్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మంగళి మాసయ్య, పెద్ద జంగయ్యల ఏడెకరాల పొలం గ్రామానికి చెందిన పిల్లి గోపాల్ కౌలుకు తీసుకుని వరి సాగు చేశాడు. ఆదివారం సాయంత్రం గోపాల్ పొట్ట దశలో ఉన్న వరి పంటకు యూరియా చల్లుతుండగా అదే గ్రామానికి చెందిన ప్రభాకర్ తన మేకలను మేపుతూ అటుగా వచ్చాడు. వరి చేను వద్ద ఉన్న యూరియాను గ్రహించక పోవడంతో 12 మేకలు యూరియా బుక్కి అస్వస్థతకు గురై చనిపోగా, మరో రెండు మేకలు చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాయి.

ఆందోళనలో అన్నదాతలు

» అధిక వర్షాలతో ఆగమైన పత్తి పంట » చేతికొచ్చిన పంట నేల పాలు



పత్తి ఏరుతున్న కూలీలు



తడిసిన పత్తిని ఆరబోసిన రైతులు

భూత్పూర్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : వర్షాలు అధికంగా కురియడంతో చేతికొచ్చిన పంట నేలపాలైంది. దీంతో అన్నదాత ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది మండలంలో 6,500 ఎకరాల్లో రైతులు పత్తి, 5 వేల ఎకరాల్లో వరి పంటను సాగు చేసినట్లు వ్యవసాయాధికారుల అంచనా. గతేడాది ఎకరాకు పత్తి పంట 10 నుంచి 12 క్వింటాళ్ల వరకు దిగుబడి రాగా, క్వింటాలుకు రూ.6,600 నుంచి రూ.7500 పలికింది. కాగా ఈ ఏడాది దిగుబడి తగ్గడంతో పాటు ఎకరాలకు 4 నుంచి 6 క్వింటాళ్ల దిగుబడి రాగా, క్వింటాలుకు రూ.5,500 మాత్రమే పలకడంతో రైతులు నిరాశ చెందుతున్నారు. ఎకరాకు పెట్టుబడి రూ.30 నుంచి రూ.50 వేల వరకు పెట్టుబడి అవుతుండగా, పత్తి ధర పెరగడం లేదని రైతులు దిగులు చెందుతున్నారు. పత్తి చేతికొచ్చే సమయానికి కాగా గతంలో ఎన్నడూ లేని విధంగా వర్షాలు కురియంతో 30 నుంచి 40 శాతం వరకు పంట పాడైంది. సెప్టెంబరు 31 వరకు 1066.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదుకాగా, అక్టోబరు 6వ తేదీన 50.2 మిల్లీ మీటర్లు, 9వ తేదీన 57.6 మిల్లీ మీటర్లు అత్యధికంగా వర్షం పాతం నమోదైంది. దీంతో కాయ నుంచి బయటికొచ్చిన పత్తి వానకు నాని నల్లబారింది. ప్రభుత్వం స్పందించి న నష్టం పరిహారం చెల్లించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

దిగుబడి తగ్గింది..



ఈ సారి రెండెకరాల్లో పత్తి పంటను సాగు చేశారు. వర్షాల కారణంగా ఎకరాలకు 4 నుంచి 5 క్వింటాళ్ల వచ్చే అవకాశం ఉంది. ఉన్న పంట కూడా వర్షానికి నల్లబడింది.

- విజయ్‌రెడ్డి, కొత్తమొల్గర

పెట్టుబడి రావడమే కష్టం..



చాలా ఏళ్లుగా పత్తి పంటను సాగు చేస్తున్నాం. ఎప్పుడూ ఇంత నష్టం రాలేదు. కాని ఈసారి మాత్రం పెట్టబడి కూడా వచ్చేది కష్టమే. లాభం లేకున్నా కనీసం పెట్టుబడి అయినా వస్తే బాగుండేది.

- మణెమ్మ, రైతు, కొత్తమొల్గర

అప్పు తీర్చే మార్గం కనబడటం లేదు..



పత్తి పంట మీద వచ్చే ఆదాయంతో పిల్లల చదువులకు ఇబ్బంది పడేవాళ్లం కాదు. కానీ ఇప్పుడు అప్పు తీర్చే మార్గం కనిపించడం లేదు. అధిక వర్షాలతో చేతికొచ్చిన పంట పాడైపోయింది.

- బాల్‌రెడ్డి, కర్వెన

అర్ధరాత్రి వాహనాల తనిఖీ

» పోలీస్ పెట్రోలింగ్ పరిశీలన

మహబబూబ్‌నగర్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఎస్పీ జానకి అర్ధరాత్రి రోడ్డు పైకి వచ్చారు.. ఉన్నట్టుండి వాహనాలను తనిఖీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. బస్టాండ్, న్యూటౌన్, పద్మావతికాలనీ ప్రాంతాల్లో వాహనాలను తనిఖీ చేయించి లైసెన్స్‌లు, వాహనాల ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. ప్రధాన రహదారులు, కూడళ్ల వద్ద అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తులను తనిఖీ చేశారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో శాంతిభద్రతలను కాపాడటమే పోలీసుల కర్తవ్యం అన్నారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

అసాంఘిక చర్యలపై దృష్టి పెట్టాలి..

పాలమూరులో అర్ధరాత్రి జరిగే అసాంఘిక చర్యలపై పోలీసులు దృష్టి పెట్టకపోగా, పరోక్షంగా సహకరిస్తున్నారన్న విమర్శలున్నాయి. వీటిపై ఎస్పీ దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. అర్ధరాత్రి దాటినా పలుచోట్ల పాన్ డబ్బాలు తెరిచి ఉండటం, గంజాయి సప్లై అవుతుందన్న విమర్శలున్నాయి. అర్ధరాత్రి ఇసుక దందా యథేచ్ఛగా సాగుతోంది. బైక్ రైడింగ్‌తో యువత రోడ్లపై దూసుకెళ్తున్నారు. వీటిపై ఎస్పీ దృష్టి సారించాలని నగర ప్రజలు కోరుతున్నారు.

రహదారికి యువకుడి మరమ్మతు



మరమ్మతు చేసిన చెన్నారెడ్డిపల్లి రహదారి

నవాబ్‌పేట, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెన్నారెడ్డిపల్లిలో రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి గ్రామ ప్రధాన రహదారి గోతి పడి గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ఎంపీడీవో జయరాములు ఆదేశానుసారం గ్రామ యువకుడు జైపాల్ యాదవ్ రూ.40 వేలు వెచ్చించి మొరం వేయించి, మరమ్మతు చేయించడంతో గ్రామస్థులు జైపాల్‌ను అభినందించారు.

పెండింగ్ డీఏలు మంజూరు చేయాలి



మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్ డీఏ బిల్లులను మంజూరు చేసి నూతన పీఆర్సీ కమిటీ రిపోర్టును వెంటనే ప్రకటించాలని టీఎస్ యూటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు రవికుమార్, వెంకటేష్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని యూటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను మంజూరు చేయాలని, నూతన వేతన సవరణ కమిటీ రిపోర్టును అమలు చేయాలని, దీర్ఘ కాలికంగా పెండింగ్‌లో ఉన్న బెనిఫిట్స్‌ను వెంటనే మంజూరు చేయాలన్నారు. జిల్లాలో ఉపాధ్యాయుల సర్దుబాటు పలు మండలాల్లో నిబంధనలకు విరుద్ధంగా జరిగిందని దాన్ని సరిదిద్దాలన్నారు. కొందరు మండల విద్యాశాఖ అధికారులు ఇష్టారీతిగా ఉపాధ్యాయులను ఇతర పాఠశాలకు పంపించారని, దీనిపై సంబంధిత ఎంఈవోలపై చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో నిర్వహించిన కుటుంబ సర్వే డబ్బులు ఇప్పటికీ ఇవ్వలేదని వారి డబ్బులు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కిష్టయ్య, ఉపాధ్యక్షురాలు ఉమాదేవి, కోషాధికారి భాస్కర్, వేణుగోపాల్, శివరాజ్, అర్చన, శ్రీనివాసులు పాల్గొన్నారు.

జడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యుడికి పరామర్శ

మూసాపేట, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : అడ్డాకుల మండలం పొన్నకల్‌కు చెందిన జడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యుడు పొన్నకల్ మహిమూద్ ఇటీవలే అన్నాసాగర్ వద్ద రోడ్డు ప్రమాదంలో గాయపడి జిల్లా కేంద్రంలోని నేహాసన్‌షైన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు రాజశేఖర్‌రెడ్డి, ఇంద్రయ్యసాగర్ పరామర్శించి, మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు.

రహదారి సమస్యను పరిష్కరించాలి



దీక్షలో పాల్గొన్న న్యూ మోతీనగర్ కాలనీవాసులు

మమబూబ్‌నగర్ న్యూటౌన్/పాలమూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : నగరపాలక పరిధిలోని న్యూ మోతీనగర్‌లో నెలకొన్న రోడ్డు సమస్యను కొంతకాలంగా పాలకులు, అధికారులు పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేయడంతో కాలనీవాసులు రెండు రోజులుగా రైల్వేస్టేషన్ రోడ్డులో దీక్షలు చేపట్టారు. ఆదివారం దీక్షలో కాలనీకి చెందిన పలువురు మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాల కారణంగా నీరు ఇళ్లలోకి చేరి ప్రజలు ఇబ్బందులు పడ్డారని, ఈ సమస్య గత 50 ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోలేదన్నారు. సమస్యను పరిష్కరించకపోతే ఈ దీక్షను అమరణ దీక్షగా మారుస్తామని హెచ్చరించారు. దీక్షలో కాశపోగు ప్రసాద్, వార్డు పెద్దలు నాగయ్య, భగవంతు, కొండయ్య, పోలీసు రాములు, జయమ్మ యాదవ్, రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనంపై నుంచి కింద పడి యువకుడి మృతి

జడ్చర్ల, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కిష్టంపల్లి గ్రామ సమీపంలో ద్విచక్రవాహనంపై నుంచి కిందపడి యువకుడు మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజీపేట మండలం మారేపల్లి గ్రామానికి చెందిన ఇప్పలపల్లి బంగారు (30)తో పాటు మరో వ్యక్తి జడ్చర్ల నుంచి తిమ్మాజీపేట వైపు ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. కిష్టంపల్లి గ్రామ సమీపంలో ఎదురుగా ఆటో రావడంతో సడన్ బ్రేక్ వేయడంతో వెనకసీటులో కూర్చున్న బంగారు కింద పడి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటనకు సంబంధించి ఫిర్యాదు అందలేదని జడ్చర్ల పోలీసులు తెలిపారు.

సేంద్రియ వ్యవసాయంతో సంపూర్ణ ఆరోగ్యం



అవగాహనలో పాల్గొన్న వ్యవసాయ వృత్తిదారుల సంఘం సభ్యులు

గండీడ్/మహమ్మదాబాద్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : సేంద్రియ వ్యవసాయంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని తెలంగాణ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ ఉమ్మడి మండల కోఆర్డినేటర్లు స్వాతి, జ్యోతి పేర్కొన్నారు. ఆదివారం మహమ్మదాబాద్ మండలం ముకర్లబాద్‌లో ఉపాధి హామీ కూలీలు, వ్యవసాయ కూలీలకు, రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణానికి హాని కలిగించే పురుగు మందులు వాడడం వల్ల పిల్లల మెదడుపై ప్రభావం చూపుతోందని, మానవాళి మనుగడకు పెను ప్రమాదం అన్నారు. ఈనెల 16న ఆహార భద్రత దినోత్సవం ఉంటుందని, ఆకలి దినం పోయి ఆహారం అందేలా చర్యలు చేపట్టాలని, కూలీలకు వేతన చట్టం అమలు చేయాలన్నారు.

జాబ్ క్యాలెండర్‌ను అమలు చేయాలి



మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ ప్రశాంత్

జడ్చర్ల, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలో భాగంగా జాబ్ క్యాలెండర్‌ను అమలు చేసి, ఉద్యోగాల భర్తీకి సంబంధించిన నోటిఫికేషన్‌ను జారీ చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ ప్రశాంత్ డిమాండ్ చేశారు. పట్టణంలోని అంబేడ్కర్ కళాభవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన నిరుద్యోగ సదస్సులో పాల్గొని, మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని కోరారు. అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామంటూ ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశం కల్పించే వరకు ప్రతీ నిరుద్యోగికి నెలకు రూ.4 వేల నిరుద్యోగ భృతిని ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఎలాంటి షరతులు లేకుండా రాజీవ్ యువ వికాస పథకాన్ని అమలు చేయాలని కోరారు. నిరుద్యోగ సమస్యపై చర్చించి తక్షణమే నోటిఫికేషన్‌లు వేయాలని, లేకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు రాములు, కురుమూర్తి, భానుప్రసాద్, మహేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జగన్, సాయిలు, రాము, అంజి, జగన్, నర్సింహులు, శ్రీకాంత్, చెన్నకేశవులు, మహేష్ పాల్గొన్నారు.

నడకతోనే ఆరోగ్యం : ఎమ్మెల్యే యెన్నం



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌వీఎస్ యాజమాన్యం

మహబూబ్‌నగర్ వైద్యవిభాగం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత సమాజంలో ప్రతీరోజు నడవాలని, నడకతోనే ఆరోగ్యంగా ఉంటారని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం ప్రపంచ ఆర్థరైటిస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎస్వీఎస్ ఆసుపత్రి ఆధ్వర్యంలో సేవ్ ద జాయింట్స్ అనే నినాదంతో మారథాన్ అవగాహన ర్యాలీ చేపట్టారు. జిల్లా కేంద్రంలోని పద్మావతి కాలనీ నుంచి ఎస్వీఎస్ ఆసుపత్రి వరకు ఏర్పాటు చేసిన ర్యాలీని ప్రారంభించి, మాట్లాడారు. ఆర్థరైటిస్ చాలా మందిలో ఉందని, కాని దానిపై అవగాహన లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆర్థరైటిస్ ఉన్నవాళ్లు ప్రతీరోజు కొద్ది దూరం నడవాలని, నడకతో ఆర్థరైటిస్‌ను దూరం చేసుకోవచ్చని అన్నారు. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ముందుకొచ్చిన ఎస్వీ ఎస్ యాజమాన్యాన్ని అభినందించారు. ఎస్‌వీఎస్ విద్యాసంస్థ డైరెక్టర్ డాక్టర్ కృష్ణారెడ్డి, ఆసుపత్రి రెసిడెంట్ డైరెక్టర్ రాంరెడ్డి, డాక్టర్ జయరాంరెడ్డి, ఎస్వీఎస్ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జోషి, డాక్టర్ ముకుందం, డాక్టర్ ప్రసన్న పాల్గొన్నారు.

బీజేపీదే అధికారం : ఎంపీ డీకే అరుణ



యువకులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ డీకే అరుణ

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం అని జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. ఆదివారం ఎంపీ క్యాంపు కార్యాలయంలో పాలమూరు రూరల్ మండల పరిధిలోని ఫతేపూర్ గ్రామానికి చెందిన 100 మంది యువకులు పార్టీలో చేరగా, ఆమె కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీజేపీ అభ్యర్థులను గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్‌రెడ్డి, బీసీ మోర్చా అధ్యక్షుడు యాదయ్య, మీడియా కన్వీనర్ సతీష్ కుమార్, మండల అధ్యక్షుడు గంగయ్య, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రాజుగౌడ్, రాఘవేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

42శాతం రిజర్వేషన్ సాధనకు పోరాడుదాం



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న బీసీ జేఏసీ కమిటీ చైర్మన్ బెక్కెం జనార్దన్

పాలమూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : బీసీలకు 42శాతం రిజర్వేసన్ అమలు పోరాటంతోనే సాధ్యమవుతుందని బీసీ జేఏసీ కమిటీ చైర్మన్ బెక్కెం జనార్దన్ పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన బీసీ జేఏసీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రిజర్వేషన్ సాధనకు అలుపెరగని పోరాటం చేయాలని, బీసీ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టనున్న పోరాటంలో ప్రతీ బీసీ కుల సంఘం భాగస్వామ్యం కావాలన్నారు. బీసీ నాయకులు, కుల సంఘాలు, బీసీలు ఏకం కావటానికి బీసీ జేఏసీ ఏర్పడిందన్నారు. బీసీ జేఏసీ కన్వీనర్‌గా కోరమోని వెంకటయ్య, పాండురంగం, శేఖరాచారి, శ్రీనివాస్, ప్రభాకర్, లక్ష్మీకాంత్, కిన్నెర శేఖర్, గంగాధర్, వెంకట్రా ములు, సారంగం లక్ష్మీకాంత్, వెంకట్రాములు, విజయకుమార్, మహేందర్, రాజు, పురుషోత్తం, రాంచందర్‌జీ, రమేష్, సాయిలు యాదవ్, మైత్రియాదయ్య, ప్రేమ్‌సాగర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మిగతా కార్యవర్గాన్ని త్వరలో ప్రకటిస్తామని తెలిపారు.

బీసీ సంఘాల ఆధ్వర్యంలో రేపు రాష్ట్ర బంద్



అభివాదం చేస్తున్న బీసీ సంఘాల నాయకులు

జడ్చర్ల, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : బీసీలకు 42శాతం రిజర్వేషన్ అంశంలో హైకోర్టు ఇచ్చిన స్టేకు నిరసనగా బీసీ సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం రాష్ట్ర బంద్‌ను చేపట్టినట్లు బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుపల్లి కృష్ణయాదవ్, విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్ పేర్కొన్నారు. జడ్చర్ల మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ బీసీలకు రిజర్వేషన్‌ను అందకుండా చేయడమంటే నోటికాడి బువ్వను లాక్కోవడమేనన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీసీ జాగృతి సేన నాయకులు నర్సింహులు, రఘు, నాగేశ్, శివశంకర్, మధుసూధన్, కృష్ణ, శేఖర్, జహీర్, గిరి, జహంగీర్ పాల్గొన్నారు.

మెరుగైన విద్య అందించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

జడ్చర్ల, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలని అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ పేర్కొన్నారు. మండలంలోని మల్లెబోయిన్‌పల్లి స్టేజీ వద్ద ఉన్న గిరిజన బాలికల మినీ గురుకులంను ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో భోజనం, ఉపాధ్యాయులు బోధిస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అలాగే భోజనశాలతో పాటు స్టోర్ రూం, కిచెన్, డైనింగ్‌హాల్‌ను పరిశీలించారు. పాఠశాలలో ప్రహరీ పడిపోయిందని ప్రిన్సిపల్ మౌనిక అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పాఠశాలలో మౌలిక వసతులు కల్పించేందుకు చేపట్టాల్సిన వివరాలను పంపంపించాలని ప్రిన్సిపాల్‌కు అదనపు కలెక్టర్ సూచించారు.

ప్రభుత్వ స్థలంలో ప్రైవేట్ వ్యక్తుల క్లీనింగ్



డీసీఎంఎస్ స్థలాన్ని చదును చేసిన ప్రైవేట్ వ్యక్తులు

జడ్చర్ల, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ స్థలాన్ని ప్రైవేట్ వ్యక్తులు క్లీనింగ్ చేస్తున్నారు. జడ్చర్ల మునిసిపాలిటీ 17వ వార్డులో ప్రభుత్వ కోఎడ్యుకేషన్ జూనియర్ కళాశాల సమీపంలో ఉన్న డీఎసీఎంఎస్ స్థలంలో ప్రస్తుతం ఓ వ్యక్తి లెవలింగ్ కార్యక్రమంతో పాటు షెడ్ నిర్మాణానికి సంబంధించిన పనులను ఆదివారం ప్రారంభించారు. ప్రభుత్వ స్థలంలో ప్రైవేట్ వ్యక్తి పనులు చేపట్టడంతో వార్డు ప్రజలు ప్రశ్నించారు. డీసీఎంఎస్‌కు సంబంధించిన రెండెకరాల స్థలం లీజుకు తీసుకున్నామని, ఆ స్థలంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ల మరమ్మతు కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు సదరు వ్యక్తి వెల్లడించారు. దీంతో వార్డు ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. డీసీఎంఎస్‌కు సంబంధించిన స్థలంలో ప్రస్తుతం జరుగుతున్న పనుల కారణంగా కాలనీలో ట్రాన్స్‌ఫార్మర్ ఆయిల్, కెమికల్స్ కారణంగా గాలి, నీటి కాలుష్యం పెరుతుందన్నారు. ప్రస్తుతం డీసీఎంఎస్ స్థలంలో ఎప్పటిలాగే గిడ్డంగులు, రైతులకు ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ స్థలాన్ని ఇతరుల అవసరానికి డీసీఎంఎస్ కార్యాలయంలోని ఓ అధికారి, అత్యుత్సాహంతో అప్పగించినట్లుగా తెలిసింది.